నారదస్త్రీ పాడుతూ పాడుతూ శ్రీకృష్ణభగవానులవారి అడుగుల సవ్వడి చీకట్లో విన్నదై పాట ఆపి "ఎవరు మహానుభావులు ?" అని పృచ్ఛించింది. "నేను నారదమహర్షిని" అన్నారు స్వామివారు. "కారు ! కారు ! నారదమహర్షులుకారు. నారదమహర్షులే అవితే ఏది యీ చితారు మోగించిపాడండి" అంది జవ్వని.

స్వామి అపూర్వంగా సరిగ్గా నారదులవారెలా వాయించీవారో అలావాయించారు, ఆ జవ్వని చేతిలోనుంచి చితారందిపుచ్చుకుని.

జవ్వని ఆహ్లాళంగా అంది "నా హృదయాన్ని కరిగించిన మగవాడింతవఱకూ వొకడూలేడు దేవా ! మీరుతక్క ! మీపేరు ?" అని అడిగింది. "ఈ మధ్యాహ్నం కలుసుకోలే మనం" అని అంటూ స్వామి తిరోహితులైనారు.

"ఆయన శ్రీకృష్ణభగవానులా ?" అని జవ్వని మర్నాటి నుంచీ తన్నుదాను ప్రశ్నించుకుంటూ భిక్షాటనమఱచి ఆ చెట్టు క్రిందే మహాతపస్సు చేసిచేసి తరించింది.

.... .... .... .... ....

## ఆత్మసంస్కారము

"ఇప్పటికో మడతమంచం మనం సంపాయించుకోగలిగాం !" అని అంటూవుంది ఓ అమ్మి తనముందు కోతినెట్టుకుని. అలా అంటూవుంటే—పెంపుడుకోతి అది, బిచ్చగాంద్రకోతి అది,—ఊరికే ఆ మడతమంచం మీదికెక్కి పిల్లిమంతరాలేస్తూ కిందకు దిగుతూ వినోదంకలిగిస్తూవుందా అమ్మికి.

అనతిదూరంలోనే గోదావరీస్రవంతి ప్రవహిస్తూవుంది క్రొందేటనీటితో సంధ్యారాగ సుకాంతి యెఱ్ఱనిరంగుతో పశ్చిమాకాశవీధిని అలముకుంటూ వున్నప్పటికిన్నీ, శీతాకాలపొద్ద వడంవల్ల చాకలివాళ్ల బట్టలింకా బాగా ఆరలేదనుకుంటూ చాకిరేవుసందడినే యున్నారు. తీరసమప్రదేశాన్ని తాత్కాలికంగా కర్రలు పాతి అమర్చుకొన్న తాళ్ళదండాలను ఎఱ్ఱవి, నల్లవి, ఆకుపచ్చవి, తెల్లవి, నీలానివి, గులాబీవి, కాఫీవి, పసుప్పచ్చవి, ఎన్నిరంగులు ప్రపంచంలోవుండాలో అన్నిరంగులయుడుపులు, పంచిలు, చీరలు, పంట్లాలు, కోట్లు, కమీజులు, కబ్బాలు, నిక్కర్లు, చొక్కాలు, జంపర్లు, జాకెట్లు, లంగాలు, లుంగీలు, దుప్పట్లు, గలేబులు, పరికిణీలు, వోణీలు, గోచీలు, గోణాలు, బనియన్లు, బాడీసులు లక్షోపలక్షలుగా గాలికారుతూ వున్నాయి.

"ఇఖ మనకేంగావాలి?" అని అడిగింది ఆ అమ్మి ఆ కోతిని. తనలో తానే జవాబుగా అనుకుంది ఆ అమ్మి "శీతకాల మొచ్చింది కాబట్టి ఓ జుబ్బా నీకూ, ఓ కబ్బా నాకూను. రేపడుక్కుందాం! ఏ తల్లైనా యివ్వకపోద్దా?" అని ఆ అమ్మి అలా అనుకుంటూవుంది. కోతి వూరికే పిల్లిమంత్రాలేసేస్తూ వుంది మడతమంచంమీద. కొంతసేపటికా అమ్మి కేంతోచిందో "తిమ్మన్నా! మడతమంచం అలా తొక్కేయ్యడానిక్కాదు. దిగు" అని దాన్నిదింపి ఆ మంచం కోటిక్కట్టి పారేసింది. కాస్సేపుగింజుకుని కోతి కిందే తొంగుదుండిపోయిం దుత్తినేల మీదనే. ఆ అమ్మి అలా, మంచంమీద కోతిలేకపోయినా, కోతి పిల్లిమంత్రా లేయకపోయినా, ఇంకా ఆ మడతమంచం కేసే చూస్తూవుంది.

మసకమసకగా చీకటికమ్ముకొస్తూవుంది. చాకలివాళ్లు బట్టలు మడతలెట్టుకుని మూటలు కట్టుకుని నెత్తికెత్తుకుని ఇళ్ళకు పోతూ అనుకుంటూవున్నారు "సుబ్బక్క యీవేళ మడతమంచం సంపాదించిం" దని.

"ఏమిట్రా సుబ్బక్క మడతమంచం సంపాదించడం లోని విశేషం? మడతమంచం సంపాదించటమనేది అంతగొప్ప పనిటర్రా!" అని అడిగితే వాళ్ళన్నారూ—"కాదుటండీ, జబ్బ లడిపోయీటట్టు తెల్లాఅగట్లనుంచి యియ్యేలదాకా బల్లేమేం మేమే బల్లన్నట్టు బాదుకుంటేనేగాని చేరెడునూకలు రావుగదా మాకు. దానికి చూడండి రోజూ కుంచెడుబియ్యం దొరకడమేకాకుండా యీయేల మడతమంచం దొరికింది. చేసేపని పట్నంలో కోతి నాడించడం" అని అనుకుంటూపోయినారు.

సుబ్బక్క పక్కన నవ్వుతూ అంటించింది మాటొకటి ఆ చాకలాళ్ళను. "ఏంటర్రా! నన్నుగురించే అనుకుంటూ వున్నారు? మీ కప్పుడే కడుపుబ్బుతూందటర్రా! కోతికి జుబ్బా లేదు, నాకు కబ్బాలేదు. చలేసుకొస్తూ వుంది. ఒరేవ్ పోతిగా! ఓరి చాకలిపోతిగా! ఓ దుప్పటీ ఇలాపారేసిపోదూ నీకు పున్నె ముంటుంది. రేపిస్తాను మళ్ళీని;" అని అడిగింది.—పోతిగాడన్న చాకలి కొంచెం వెనక్కుతిరిగి సుబ్బక్కనుచూచి "దుప్పటీ కావాలేం? నీకు? దుప్పటీ?" అంటూ చక్కాపోయినాడు.

క్షణికంలో గోదావరీతీరమంతా నిర్మానుష్యమైపోయింది. సుబ్బక్క వొక్కర్తే వుందక్కడ. వొక్కర్తేయేంటేండి; కోతి వుంది. కోతీ తానూ కలిసి ఆనాడు సంపాదించుకున్న మడత మంచంవుంది. ఉండేంలాభం అవి? దీపంలేదు! దివిటీలేదు. చలేసుకొస్తూవుంది గడ్డముక్కతుక్కదాను.

ఆచల్లో సుబ్బక్క తానానాడు సంపాదించుకున్న మదత మంచం ఎక్కికూర్చుని ఆలోచిస్తూవుంది. దేన్నిగురించి అంటే— ఆ రోజు మధ్యాహ్నం పట్నంమధ్యనున్న ఆంజనేయస్వామి గుడిముందో కపిధ్వజంతోకూడిన ఎత్తయిన ఆకాశదీపస్తంభం నెలకొల్పబడింది. ఆ స్తంభంయొక్క యెత్తునుగురించీ, దాని చివర అల్లాడిన ఆంజనేయస్వామివారి జండానుగురించీ ఆ అమ్మి అట్టే ఆలోచించడం ప్రారంభించింది. అలా ఆలోచించడం ప్రారంభించి ప్రారంభించి నిద్రపట్టక కళ్ళు ఆ తట్టుకు తిప్పింది. తా నేజండానుగురించి ఆలోచిస్తూవుందో ఆ జండాచెంత మినుకు మినుకుమంటూ చిన్నదీపం ముత్తెమంత వెలుగుతూవుండడం కనుక్కుంది.

"ఇప్పటికి చూడగలిగాను, ఇన్నాళ్ళ కిక్కణ్నుంచియీ వెలుగు ; ఇప్పటికి చూడగలిగాను" అని అనుకుంది.

మంచంక్రింది చాటున కోతీ చూచింది ఆ వెలుగు. కోతి కిచకిచమంటూ అందికదా మనుష్యకంఠంతో—"సజీవంతోవున్న నా చుట్టూ చీకటిగావుంటే, ఎవరక్కడికి ఎక్కించుకు పోయినారు? నిర్జీవమైన ఆకాశంలోకి ఆ దీపాన్ని ?" అని అడిగింది.

"అదీ నీ లాగాడే జండావే! దానిదగ్గఱ వెలుగుతూ వుందాదీపం ! ఊరుకో అట్టేపేలకు" అంది సుబ్బక్క.

"ఎవరాడిస్తున్నారు దాన్ని ?" అని ప్రశ్న.

"మనిషే, దాన్ని నాలాంటిమనిషే" అని జవాబు.

"అందరూ మనుష్యులే, అందరూ కోతులే !" అంటూ చాకలిపోతిగాడు వచ్చేడు, పెద్ద మాసిపోయిన బట్టలమూటా వాడూ తూర్పింకా తెల్లారకుండానే,

సుబ్బక్క అంటుంది “ పోతిగా ! మడతమంచంమీదగానీ కూకునేవుగనక ! ఇప్పటికి సంపాదించుకోగలిగాం ఓ మడత మంచం ! ”

పోతిగాడు : ఎవరెవరు సంపాదించుకున్నా రీమడత మంచం ? సుబ్బక్కా !

సుబ్బక్క : “ నేనూ, నా కోతీని ” అంటూ అడిగింది పోతిగాణ్ణి — “ అకాశదీపం అంజనేయుని గుడిముందీరేత్రి కొత్తగా వెలిగించింది చూచావా ? ” అని.

పోతిగాడంటాడు. “ అన్నీ దీపాలే ! అన్నీ గుళ్ళే ! ”

సుబ్బక్కఅంటుంది. “తెల్లవార్లూ సలేసుకుపోయిందిరో!” అని.

పోతిగాడు : మరి దీపం నూశానంటున్నావు ? దీపం నూశాక్కూడా సలే ?

సుబ్బక్క : సలి సలే ! దీపం దీపమే ! ఏమంటావు ?

పోతిగాడు : నీ వేదాంతం నాకు తెలదు. తెల్లారి కోతి విప్పా పోతారు. మాపటికి కుంచెడుబియ్యం తెచ్చుకుని యీ మడతమంచంమీద కూచుని ఏరుకుంటూ కూర్చుంటారు. మీదే అదృష్టం !

సుబ్బక్క : పోతన్నా ! నాకోకబ్బా నా కోతికోజుబ్బా యీయేల దొరికితే మరేం వొద్దు.

పోతన్న : దొరుకుద్ది. [ అని పోతాడు పోతన్న ]

సుబ్బక్క : “ ఇప్పటి కోమడతమంచం వచ్చిందా మనకు ! తిమ్మన్నా ! ఇఖ నీకోజుబ్బా నాకోకబ్బా ! లెగు ! తిమ్మన్నా ! ” అంటూ తిమ్మన్నను లేవగొట్టుకు సుబ్బక్క ముష్టికి పట్నం మమ్మట బయల్దేరింది.

* * * * *

నాడు పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు. "సుబ్బక్కా! యీ వేళ బాగున్నావు!" అని అంతా అంటే సుబ్బక్క అంది "ఉన్నానుకమోసు—తల్లుల్లారా! తండ్రుల్లారా! ఇన్నాళ్ళమల్లే కడచిన మాపు నేలమీద చెమ్మలో తొంగుడుండలేదు నేను. మీ దయవల్లా మీ దయవల్లా ఓ మడత మంచం నిన్న సంపాదించుకుని అందుమీద తొంగుడుండాను. అందుమూలాన్ని కమోసు కాస్తంత జలుబూగిలుబూ వదిలి నేవళీకంగా కనబడుతున్నాను. అయినా చెప్పదగ్గ అందం నాలో ఏముంది? నే చూచిన దీపంలోవుంది!"

అలా అంటూంటే నిజంగా సుబ్బక్కకళ్లు మెరిసిపోయి నాయి. పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు.

.... .... .... .... ....

## ఎద్దడి నీళ్లు

వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనే భయంవేస్తూంది.

వ్రాస్తే వ్రాత కోభాగ్యం అనుకుంటే ఒకముక్క వ్రాయ వచ్చును.

కళ్ళల్లోకంటా ఎటుచూచినా, చెవుల్లోకల్లా ఎటువిన్నా వేడిగాడుపే.

"నీ కలా యుండాలని నా కోరికే. నీ వలాయుండాలని నా కోరికే."

ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వాని యూహ.